
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 17 ఏప్రిల్ 2024 | 3





27 ఏళ్ల కిందట శిరోముండనానికి గురైన బాధితులు (ఫైల్)

కోర్టు తీర్పుతో దళితులకు న్యాయం



శిరోముండనం కేసులో నిందితులకు 18 నెలలు జైలు శిక్ష విధించడంతో కోర్టుపై చాలా నమ్మకం కలిగింది. ఈ కేసులో న్యాయం కోసం 28 ఏళ్లుగా ఎదురు చూశాం. కోర్టు తీర్పుతో దళితులకు న్యాయం జరిగింది. - **కనికెళ్ల గణపతి, బాధితుడు**

27 ఏళ్లు కోర్టుల చుట్టూ తిరిగాం



27 ఏళ్లుగా కోర్టుల చుట్టూ తిరిగాం. ముద్దాయిలకు ఎట్టకేలకు శిక్ష ఖరారు చేయడంతో సంతోషంగా ఉన్నా. మిగిలిన బాధితులు, నాయకులతో కలిసి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటాం.- **చల్లపూడి పట్టాభి, బాధితుడు**

కేసు నిలిపిన ఘనత బొజ్జా తారకానిదే



పుట్టుస్వామి కమిషన్ నివేదికతో అప్పటి ప్రభుత్వం శిరోముండనం కేసు ఎత్తివేసింది. హైకోర్టు న్యాయవాది బొజ్జా తారకం మాండమస్ రిట్ వేసి కేసు విచారణ పునఃప్రారంభించేలా చేశారు. **-వి.భీమశంకరం, దళిత ఐక్య పోరాట వేదిక కన్వీనర్**

వివాదాల తోటలో..
ధర్మమే గెలిచింది!



శిరోముండనం కేసులో 27 ఏళ్ల తర్వాత జైలు శిక్ష

- మండపేట వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులు సహా 9 మందికి శిక్ష
- 18 నెలలు తక్కువ శిక్షపై ఆవేదన
- మళ్లీ పోరాడతామంటున్న బాధితులు
- వెంకటాయపాలెంలో హర్షం
- మూడేళ్ల కిందట వైసీపీ ఎంపీ బోస్ ఫిర్యాదు
- నాడు చర్చనీయాంశమైన అంశం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఒకటికాదు రెండు కాదు.. ఏకంగా 27 ఏళ్ల పైమాటే.. న్యాయం కోసం తిరగని కోర్టు లేదు.. ఎట్టకేలకు సుదీర్ఘ నిరీక్షణ ఫలించింది. శిరోముండనం నిందితులకు శిక్ష ఖాయమైంది. కానీ తీర్పు వచ్చిన ఆనందంకంటే తమకు అసలైన న్యాయం జరుగుతుందని ఇన్నేళ్లు నిరీక్షించిన క్షణాలకు విలువ లేకుండా పోయిందని ఆ బాధితులు వాపోతున్నారు. న్యాయం కోసం 27 ఏళ్ల కళ్లుకాయలు కాసేలా ఎదురుచూసి మానసిక క్షోభతో శిక్ష అనుభవిస్తే నిందితులకు కేవలం 18 నెలలే జైలుశిక్ష పడడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్నేళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తగిన న్యాయం కోసం మళ్లీ పోరాటం చేస్తామని చెప్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం శిరోముండనం కేసు తీర్పు జిల్లాలో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కేసులో తీర్పు రావడానికి ఇన్నేళ్ల నిరీక్షణకు కారణాలేమిటనే చర్చ జరుగుతోంది.

అప్పట్లో పెను సంచలనమై...

రామచంద్రపురం నియోజకవర్గానికి 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన తోట త్రిమూర్తులు ఎమ్మెల్యేగా నెగ్గారు. ఆ ఎన్నికల్లో అదే మండలం వెంకటాయపాలేనికి చెందిన ఐదుగురు దళిత యువకులు, త్రిమూర్తులు మధ్య రాజకీయ విభేదాలు తలెత్తాయి. ఈ క్రమంలో ఐదుగురు దళిత యువకులను చిత్రహింసలకు గురిచేసి ఇద్దరికి శిరోముండనం చేయించారు. ఒక ఎమ్మెల్యే ఇలా దళితులను అవమానించడంపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. దీంతో అప్పట్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ ఆదిత్య త్రిపాఠి నేరుగా వెంకటాయపాలెం వెళ్లి విచారణ చేపట్టి 1997 జనవరి 4న ద్రాక్షారామ పోలీస్‌స్టేషన్‌లో క్రైం నెం.1/1997 కింద ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. మొత్తం 10 మందిని నిందితులుగా గుర్తించగా.. నాడు ఎమ్మెల్యేగా ఉన్న తోట త్రిమూర్తులును ఏ1గా నిర్ధారించారు. జనవరి 7న త్రిమూర్తులును పోలీసులు అరెస్టు చేశారు. జనవరి 18న కోర్టులో పోలీసులు చార్జిషీటు దాఖలు చేయగా న్యాయస్థానం ఆదేశాల మేరకు 87 రోజుల పాటు త్రిమూర్తులుతో పాటు మరికొందరు సహ నిందితులను రాజమండ్రి సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు తరలించారు. ఆ తర్వాత వీరు బెయిల్‌పై విడుదలయ్యారు. 1997 అక్టోబరు 15న కేసును రాజమండ్రి నుంచి విశాఖలోని ప్రత్యేక న్యాయస్థానానికి బదిలీ చేశారు. పుట్టుస్వామి కమిషన్ రంగంలోకి దిగి 1998లో కేసు విచారణ చేపట్టింది. కమిషన్ నివేదిక ఆధారంగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కేసును ఉపసంహరించుకుంటూ జీవో జారీ చేసింది. దీనికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా దళిత సంఘాలు ఆందోళనలకు దిగాయి. అప్పట్లో న్యాయవాది బొజ్జా తారకం తదితరులు హైకోర్టును ఆశ్రయించగా కేసు మళ్లీ విచారణ మొదలైంది. నిందితులు 2006లో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. బాధితులు దళితులు కాదని, బీసీ వర్గం కిందకు వస్తారంటూ ఫిర్యాదులు వచ్చాయి. అయితే ఇవేవీ న్యాయస్థానాల్లో నిలబడలేదు. ఈ కేసులో 2020లో వైసీపీ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మధ్య వివాదాలు చోటుచేసుకున్నాయి. శిరోముండనం కేసుపై 2020 నవంబరులో ఎంపీ బోస్ రాష్ట్ర హోంమంత్రికి లేఖ రాయడం కలకలం రేపింది. ఎన్నో ఏళ్ల కిందట జరిగిన శిరోముండనం కేసులో విచారణను వేగవంతం చేయాలని ఆ లేఖలో అప్పట్లో బోస్ డిమాండ్ చేశారు. దళితులకు అన్యాయం చేసిన నేపథ్యంలో సొంత పార్టీ అయినా సరే త్రిమూర్తులును వదిలిపెట్టేది లేదని అప్పట్లో పేర్కొన్నారు. తాజా తీర్పు పైనా బోస్ స్పందించారు. పూర్తి తీర్పు చదివిన తర్వాత ఏం చేయాలో నిర్ణయిస్తానన్నారు.

జగన్ పాలనలో దళితులకు రక్షణేది..

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో దళితులకు రక్షణ లేకుండా పోయింది. ఒక పక్క నా ఎస్సీలు అంటూనే జగన్ ప్రభుత్వం దళితులను నిలువునా మోసం చేసి రోడ్డున పడేస్తే.. ఆ పార్టీ నేతలు ఎక్కడికక్కడ వారిపై దాడులు, హత్యలకు తెగబడ్డారు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణలే కాకినాడలో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ హత్య ఘటన. 2022 మే 18న తన వద్ద పనిచేస్తున్న కారు డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు అర్ధరాత్రి కాకినాడ బీచ్ రోడ్డులో హత్య చేసి మరునాడు మృతదేహాన్ని స్వయంగా తన కారులో అనంతబాబు డ్రైవర్ ఇంటికే తీసుకువచ్చాడు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గంలోని సీతానగరంలో వరప్రసాద్ అనే దళిత యువకుడికి పోలీస్ స్టేషన్‌లోనే కొందరు వైసీపీ నేతలు శిరోముండనం చేశారు. 2022 జనవరిలో కాకినాడ జిల్లా సామర్లకోటలో పోలీసుల వేధింపులు తాళలేక దళిత యువకుడు గిరీష్‌బాబు ఆత్మహత్య చేసుకున్నాడు. కాకినాడ జిల్లా తొండంగి మండలంలో జాతరలో రెండు సామాజిక వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో దళిత యువకుడు రాము మృతి చెందాడు. కోడికత్తి కేసులో దళిత యువకుడు శ్రీను జైలుపాలయ్యాడు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలోని మలకపల్లిలో దళిత యువకుడి హత్య, దొమ్మేరులో వైసీపీ నేతల ఒత్తిడితో దళిత యువకుడి ఆత్మహత్య జరిగాయి. ఇలా అనేక మంది దళిత యువకులు అధికార పార్టీ అరాచకాలకు బలయ్యారు.

ఇన్నేళ్లలో 10 మందికిపైగానే మృతి...

27 ఏళ్ల పాటు సుదీర్ఘంగా కొనసాగిన కేసులో బాధితులు, సాక్షుల్లో అనేక మంది చనిపోయారు. కేసులో మొత్తం 24 మంది సాక్షులుగా ఉండగా వీరిలో 10 మంది చనిపోయారు. బాధితుల్లో ఒకరు, ముద్దాయిల్లో ఒకరు చనిపోయారు. అయితే 2019 నాటికి ఈ కేసు 146సార్లు వాయిదా పడింది. 27 ఏళ్లు దాటినా తీర్పు రాకపోవడంతో బాధితులను నిరాశ ఆవహించింది. అయినా పట్టు వదల్లేదు. ఎట్టకేలకు తీర్పు వచ్చినా నిందితుడైన వైసీపీ ఎమ్మెల్సీ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రస్తుత మండపేట వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులుకు విధించిన శిక్ష చాలా చిన్నదని బాధితులు వాపోయారు. 27 ఏళ్ల పాటు తీర్పు ఇవ్వకుండా నిందితుడికి 18 నెలల జైలు శిక్ష విధించిందని మంగళవారం రామచంద్రపురంలో బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

దళిత వ్యతిరేకులకు సీట్లా?

ముప్పాళ్ల సుబ్బారావు, న్యాయవాది



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దళితులకు శిరోముండనం చేసిన తోట త్రిమూర్తులుకు మండపేట నుంచి అధికార వైసీపీ సీటు ఖరారు చేసిందని.. కోర్టు తీర్పు నేపథ్యంలో దళిత వ్యతిరేకులను వైసీపీ పోటీకి నిలుపుతుందా? లేక అభ్యర్థిని మారుస్తుందా? అని ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు ప్రశ్నించారు. దళితులకు అనుకూలమని చెప్పుకునే జగన్ తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.



శిక్ష సరిపోదు.. పోరాడతాం!

దళిత ఐక్య వేదిక సంఘం నాయకులు

శిరోముండనం కేసులో తీర్పుపై హైకోర్టులో పోరాటం చేస్తామని దళిత ఐక్య వేదిక ప్రకటించింది. రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం శివారు వీరేశగుళ్ల కాలనీలోని గుర్రాల పరంజ్యోతి స్మారక గ్రంథాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 27 ఏళ్లుగా న్యాయం కోసం ఎదురు చూస్తున్న బాధితులు, దళితులకు కోర్టు తీర్పు నిరాశ కలిగించిందన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ, మండపేట వైసీపీ అభ్యర్థిగా ఉన్న తోట త్రిమూర్తులును కోర్టు దోషిగా ప్రకటించిందని.. జగన్ ప్రభుత్వం ఏమి సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వానికి దగాపడ్డ దళితులే తీర్పు చెబుతారన్నారు. నిందితులకు 18 నెలల జైలు, జరిమానా విధించడం.... .వెంటనే బెయిల్ మంజూరు చేయడం చూస్తుంటే బాధితులకు నష్టం కలిగినట్టు ఉందన్నారు. తదుపరి కార్యాచరణ నిర్దేశించుకుని న్యాయపరమైన ప్రక్రియలో ముందుకు సాగుతామని తెలిపారు. సమావేశంలో దళిత ఐక్య వేదిక సహ కన్వీనర్ చీకట్ల వెంకటేశ్వరరావు, శిరోముండనం బాధితుడు కోటి చినరాజు, దళిత ఐక్య వేదిక నాయకులు గుబ్బల శ్రీను, వెంటపల్లి రామకృష్ణ, రేవు నాగేశ్వరరావు, బి.సిద్ధు, అంబటి కృష్ణ, సాదే రాజేష్, మేడిశెట్టి ఇజ్రాయిల్, చిన్న పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ

- అభ్యర్థులు, రిటర్నింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలి
- ఆర్వోలతో వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం ప్రారంభమవుతుందని, నామినేషన్ పత్రాలు దాఖలు చేయడంపై అభ్యర్థులతో పాటు ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. ప్రధానంగా ఆర్వోలు నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ పట్ల పూర్తి అవగాహనతో ఎక్కడా పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలని సూచించారు. కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో మంగళవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి పలు సూచనలు చేశారు. నో డ్యూస్ పత్రాల జారీ, అభ్యర్థుల డిపాజిట్ చెల్లింపు అంశాలపై సమీక్షించారు. జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల పరిశీలన సమయంలో అభ్యర్థి సమర్పించిన అన్ని సెట్లను తప్పనిసరిగా పరిశీలన చేయాలన్నారు. జిల్లాలో వాహనాల అద్దె రేట్లు, పోస్టల్ ముద్రణ చార్జీల జాబితాలను అందించాలన్నారు. నామినేషన్ దాఖలు సమయంలో అభ్యర్థి ఏవైనా పత్రాలు సమర్పించకపోతే నిర్దేశిత గడువులోగా సమర్పించాలని కోరుతూ లిఖితపూర్వక నివేదిక తీసుకోవాలన్నారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లకు డబుల్ లాక్ విధానాన్ని ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవాలన్నారు. సమావేశంలో రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ ఎస్.నుపూర్‌అజయ్, అమలాపురం లోక్‌సభ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి ఎం.ఝాన్సీరాణి, ఎన్నికల విభాగ అధికారి టి.వైద్యనాథశర్మ, పరిపాలనాధికారి సీహెచ్ వీరాంజనేయప్రసాద్ పాల్గొన్నారు.



బండారులంకలో పరీక్షను తనిఖీ చేస్తున్న డీఈవో కమలకుమారి

'స్లాస్' పరీక్షకు 98 శాతం హాజరు

- జిల్లా విద్యాశాఖాధికారి కమలకుమారి

అమలాపురం రూరల్, ఏప్రిల్ 16: జిల్లాలోని 157 పాఠశాలల్లో 3,168 మంది విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన 'స్లాస్' పరీక్షకు 98శాతం మంది హాజరైనట్టు జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.కమలకుమారి తెలిపారు. 134 ప్రభుత్వ, 23 ప్రైవేటు పాఠశాలల్లో 4వ తరగతి విద్యార్థులకు తెలుగు-ఇంగ్లీషు, తెలుగు-గణితం, గణితం-ఇంగ్లీషు సబ్జెక్టుల వారీగా పరీక్ష నిర్వహించామన్నారు. విద్యార్థులు సాధించిన అభ్యసన, సామర్థ్యాల ఆధారంగా పాఠ్య పుస్తకాల రూపకల్పన జరుగుతుందన్నారు. అమలాపురం శ్రీచైతన్య పాఠశాలలోను, బండారులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్లాస్ పరీక్ష తీరును డీఈవో పరిశీలించారు. డీసీఈబీ కార్యదర్శి బి.హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలను ఏపీవో బి.ఆదినారాయణ, సమగ్ర శిక్షా సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంవో పి.రాంబాబు పర్యవేక్షించారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్ డెస్క్

- ఒక్కో అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లు వేయవచ్చు
- అదే సమయంలో అభ్యర్థులతో ప్రతిజ్ఞ
- హోం ఓటింగ్ కోసం రేపటి నుంచి దరఖాస్తులు

అమలాపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18నుంచి 23వ తేదీ వరకు హోం ఓటింగ్ కోసం ఫారం-12(డి)లను బూత్ స్థాయి అధికారులు పంపిణీ చేస్తారని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. మే 2వ తేదీ నుంచి వారికి హోం ఓటింగ్ విధానాన్ని అమలు చేస్తామని వివరించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. నామినేషన్ల సమయం ఆసన్నమైనందున నామినేషన్ పత్రాల దాఖలు, ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థుల ఖర్చుల గణన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. లోక్‌సభ నియోజకవర్గానికి, అసెంబ్లీ నియోజకవర్గాలకు ముగ్గురు వ్యయ పరిశీలకులు, ఇద్దరు సాధారణ పరిశీలకులు రానున్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సహాయ వ్యయ పరిశీలకులు భాషా పరంగా వారికి అందుబాటులో ఉంటారన్నారు. నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన రోజు నుంచే అభ్యర్థులు వ్యయ ఖర్చులు జమ చేయాల్సి ఉంటుంది. పార్టీ స్టార్ క్యాంపెయినర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటే ఆ ఖర్చులో సగ భాగం అభ్యర్థి ఖర్చులో జమ అవుతుందన్నారు. 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, 40 శాతం దివ్యాంగత్వం కలిగి ఉండి మంచాలకే పరిమితమై పోలింగ్ కేంద్రాలకు రాలేని అభ్యర్థులకు హోం ఓటింగ్ విధానం అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు 25ఏళ్ల వయసు కలిగి ఉండాలని, ప్రతి నియోజకవర్గంలో ఒక ఆదర్శ పోలింగ్ కేంద్రాన్ని ఈ నెల 25నాటికి పూర్తి చేస్తామన్నారు. వీటిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పిస్తామన్నారు. లోక్‌సభ అభ్యర్థిగా పోటీచేసే వారు ఫారం-2(ఎ), అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థులు ఫారం-2(బి) విధిగా సమర్పించాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులకు ప్రతిపాదకునిగా ఒకరు మాత్రం ఉండాలని, స్వతంత్ర అభ్యర్థులకు పది మంది ప్రతిపాదకులు ఉండాలన్నారు. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులకు సహకరించేందుకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోటీచేసే అభ్యర్థులు హెల్ప్ డెస్క్‌లో తమ నామినేషన్లను పరిశీలించుకోవాలన్నారు. చెక్ లిస్టు ప్రకారం అన్నీ ఉన్నవి, లేనివీ నిర్ధారించుకున్న తర్వాతే నామినేషన్ వేయాలన్నారు. నేర చరిత్ర కలిగిన అభ్యర్థులు తమ క్రిమినల్ కేసుల వివరాలను నామినేషన్ పత్రంలో పార్టు-3(ఎ)లో స్పష్టం చేయాలన్నారు. నామినేషన్ పత్రాలు దాఖలు చేసే సమయంలోనే ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అభ్యర్థులు ప్రతిజ్ఞ చేయలన్నారు. ఒక అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్ల దరఖాస్తు ఫారాలు సమర్పించవచ్చు. ప్రతి అభ్యర్థి ప్రత్యేకంగా ప్రారంభించిన బ్యాంకు ఖాతా వివరాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. బ్యాలెట్ పేపరులో ముద్రణ కోసం అభ్యర్థుల తాజా ఫొటోలను అందించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, ఎన్నికల విభాగం అధికారి టి.వైద్యనాథ్‌శర్మ, కలెక్టరేట్ పరిపాలనాధికారి సీహెచ్ వీరాంజనేయప్రసాద్, యార్లగడ్డ రవీంద్ర (కాంగ్రెస్), దూరి రాజేష్ (బీజేపీ), సంసాని వెంకట చంద్రశేఖర్ (వైసీపీ), సాయిచంద్ర ప్రవీణ్ (ఆమ్ ఆద్మీ), కాశి లక్ష్మీభవాని (బీఎస్పీ), మోకా శ్రీనివాస్ (సీపీఐ) పాల్గొన్నారు.

ఎన్నికలకు నియమించిన బృందాలు
అకౌంటింగ్ బృందానికి సహకరించాలి

అమలాపురం టౌన్, ఏప్రిల్ 16: సార్వత్రిక ఎన్నికలకు జిల్లాలో నియమించిన వీడియో చిత్రీకరణ, స్టాటస్టిక్ సర్వేలెన్స్, మీడియా మోనటరింగ్, సహాయ వ్యయ పరిశీలకులు అకౌంటింగ్ బృందానికి పూర్తిగా సహకరించాలని ఎన్నికల నోడల్ అధికారి వి.శివశంకరప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో మంగళవారం మోనటరింగ్ బృందాలతో సమావేశం నిర్వహించారు. పోటీచేసే అభ్యర్థుల వ్యయ ప్రణాళికల రచనలపై నోడల్ అధికారులు విశదీకరించారు. ఈ నెల 18వ తేదీ నుంచి ప్రతీ బృందం మరింత పక్కాగా పనిచేస్తూ ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. పార్టీల అభ్యర్థుల ప్రచార ఖర్చులు, సమావేశాలు, ర్యాలీలు, బహిరంగ సభలు, ఊరేగింపులకు సంబంధించి వీడియో చిత్రీకరణ ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జరగాలన్నారు. మద్యం, సొమ్ము విచ్చలవిడిగా రవాణా కాకుండా కేవలం రూ.50 వేలు దాటిన సొమ్ములపై ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిఘా ఉంచి రూ.10లక్షలు మించి నగదు రవాణా చేస్తున్నట్టయితే ఆదాయ పన్ను శాఖ ద్వారా సీజ్ చేయాలన్నారు. వాహనాల అనుమతుల్లో భాగంగా నంబర్‌తో స్టిక్కరింగ్ ఉండాలని, లేనిపక్షంలో ఆ వాహనాలను ఆర్వో ద్వారా సీజ్ చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గానికి రెండు వీడియో సర్వే లెన్స్ టీములు పనిచేస్తున్నాయన్నారు. శిక్షణలో ఎంసీఎంసీ సభ్యుడు పి.శ్రీరామమూర్తి, సీపీవోవెంకటేశ్వర్లు, ఎల్‌డీఎం కె.శ్యామ్‌బాబు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి శివశంకరప్రసాద్

ఈవీఎంల తరలింపు

ముమ్మిడివరం, ఏప్రిల్ 16: జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో గల స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంల తరలింపు ప్రక్రియ చేపట్టారు. ముమ్మిడివరం ఎయిమ్స్‌లో ఏర్పాటుచేసిన గోదాములో జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. ముమ్మిడివరం, అమలాపురం, మండపేట, రామచంద్రపురం, రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాలకు సంబంధించి ర్యాండమైజేషన్ ప్రక్రియలో ఈవీఎంలను కేటాయించి వాటిని ఆయా నియోజకవర్గాల పోలింగ్ సంఖ్య ఆధారంగా ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి ఎన్నికల నిర్వహణ అధికారుల పర్యవేక్షణలో తరలిస్తున్నారు. వాటిని ఆయా నియోజకవర్గాల్లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలోని స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచారు.



ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాలలోని గోదాము నుంచి ఈవీఎంలను తరలిస్తున్న దృశ్యం

◆ ఎన్నికల ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 16: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకమని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సూక్ష్మ పరిశీలకులుగా నియమించిన బ్యాంకు ఉద్యోగులు, ఓఎన్జీసీ ఉద్యోగులకు కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో మంగళవారం నోడల్, మాస్టర్ ట్రైనీలతో శిక్షణ ఇప్పించారు. ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని స్పష్టం చేశారు. పోలింగ్ విధానాన్ని పరిశీలిస్తూ ఎలాంటి తప్పిదాలు, ఉల్లంఘనలు జరిగినా రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల పరిశీలకుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ముఖ్యంగా సూక్ష్మ పరిశీలకులను నియమించామన్నారు. అభ్యర్థికి ఒక పోలింగ్ ఏజెంట్ మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌లను వినియోగించే విధానాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మైక్రో అబ్జర్వర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. శిక్షణలో నోడల్ అధికారులు డాక్టర్ వి.శివశంకరప్రసాద్, కె.శ్యామ్‌బాబు, మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

◆ రూ.2.50 లక్షల నగదు సీజ్

అమలాపురం టౌన్, ఏప్రిల్ 16: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు నిర్వహించిన తనిఖీల్లో భాగంగా దిండి చెక్‌పోస్టు వద్ద రూ.2.50 లక్షలు నగదును సీజ్ చేసినట్టు ఎస్పీ ఎస్.శ్రీధర్ మంగళవారం తెలిపారు. ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో జిల్లాలో అక్రమ మద్యంపై విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఐ.పోలవరం పీఎస్ పరిధిలో ఎన్నికల ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా ఒక వ్యక్తిని అరెస్టు చేసి నాలుగు ఎన్డీపీ లిక్కర్ బాటిళ్లు, 1.32 లీటర్ల ఐఎంఎల్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. మండపేట పీఎస్ పరిధిలో ఒక వ్యక్తిని అరెస్టు చేసి ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ ఆధ్వర్యంలో అమలాపురం, ముమ్మిడివరం, ఆలమూరు, రాజోలు, రామచంద్రపురం, కొత్తపేట పరిధిల్లో ఎనిమిది మందిని అరెస్టు చేసి 64 డ్యూటీపెయిడ్ లిక్కర్ బాటిళ్లు, 11.48 లీటర్ల ఐఎంఎల్, ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ఎనిమిది కేసులు నమోదు చేశారు.

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	35	29

కాగితపు పూల సోయగం

సత్యవాడ ప్రత్యేకం







కాగితపు పూలను తయారు చేస్తున్న గ్రామస్థులు

సత్యవాడ(కె.గంగవరం), మార్చి15: ఆధ్యాత్మిక వాడగా పేరుగాంచిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం సత్యవాడలో శ్రీరామనవమికి ఓ ప్రత్యేకత ఉంది. భద్రాచలంలో సీతారాముల కల్యాణం ఏవిధంగా జరుగుతుందో ఇక్కడా అదే విధంగా జరుపుతారు. ఆరుబయట చలువ పందిళ్లు వేసి అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. ముఖ్యంగా ఇక్కడ పందిళ్ల అలంకరణ ప్రత్యేక ఆకర్షణ. సీతారాములు కల్యాణం చేయడానికి వేసే చలువ పందిళ్లను ఆకట్టుకునే విధంగా అలంకరిస్తారు. ఒక్కో చలువ పందిరి డెకరేషన్‌కు రూ.3 లక్షలు నుంచి 4 లక్షలు ఖర్చు చేస్తారు. అలంకరణ కోసం గ్రామంలోని ప్రతీవారు రేయంబవళ్లు కష్టపడతారు. మహాశివరాత్రి పర్వదినం నుంచి పందిళ్లలో అలంకరించే పూల కుండీల తయారీలో నిమగ్నమవుతారు. ఉగాది పర్వదినం నుంచి పందిళ్ల నిర్మాణం చేపడతారు. పందిళ్లలో పూల కుండీలు ప్రత్యేక ఆకర్షణ. ప్రత్యేకంగా విజయవాడ నుంచి తీసుకుని వచ్చిన క్రేఫ్, గున్నపేపరు, వార్నిష్ పేపరుతో గులాబీ, చామంతి, మందారం, మల్లె, పొద్దుతిరుగుడు, నైట్‌క్వీన్ వంటి పూలను కాగితాలతో తయారు చేస్తారు. ఇలా తయారు చేసిన 50 నుంచి 80 పూలతో ఒక కుండీని తయారు చేస్తారు. ఒక్కో పందిరిలో 24 కుండీలు, అంతకంటే ఎక్కువ అలంకరిస్తారు. ఈ పూల కుండీలు సహజమైన పూల మాదిరిగా ఉండి విశేషంగా ఆకట్టుకుంటాయి. చిన్న పెద్ద తారతమ్యంలేకుండా ప్రతీవారు పందిరి అలంకరణలో పాల్గొంటారు.

సీతారాములకు తీపి కానుక








పి.గన్నవరం, ఏప్రిల్ 16: శ్రీరామనవమి రోజున శ్రీసీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా చేసేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం వైనతేయ గోదావరి నది తీరాన వేంచేసి ఉన్న శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే పాలకోవతో పాటు వివిధ రకాల పిండి వంటలు 100కు పైగా రకాలతో తయారు చేసిన స్వీట్లను పి.గన్నవరం గ్రామానికి చెందిన పేరిచెర్ల భీమరాజు, శ్రీమతి సత్యవాణి దంపతులు కల్యాణం రోజున సీతారాములకు సమర్పించేందుకు సిద్ధం చేస్తున్నారు. 15 సంవత్సరాలుగా స్వామి వారి కళ్యాణానికి కంతసారెను తయారు చేస్తున్నామని ఈ సారెను కల్యాణం రోజున వరుడు (రాముడు) తరపున వధువు (సీతమ్మతల్లి)కి సమర్పిస్తామని భీమరాజు, సత్యవాణి దంపతులు తెలిపారు. గత 20 రోజులుగా మహిళల సహకారంతో సుమారు 200 లీటర్ల పాలతో తయారు చేసిన కోవను ఉపయోగించి పంచె, చీరతో పాటు స్వామి వారి నామం, శంఖు చక్రాలు, పర్ణశాల, వివిధ రకాల పండ్లు, కాయలు, కూరగాయలు తదితర ఆకారాలలో సీట్లు తయారు చేశామని ఆమె తెలిపారు. ఇవే కాకుండా వివిధ రకాల పిండి వంటలు కూడా అధిక మొత్తంలో సిద్ధం చేసినట్లు ఆమె చెప్పారు. కల్యాణం రోజున ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై కంతసారెను ఉంచుతామని తెలిపారు. సీతారాముల కల్యాణం అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు అమ్మవారి కంత సారె ప్రసాదాన్ని అందిస్తామని ఆమె చెప్పారు. అదే విధంగా ఆలయం ఎదుట స్వామి వారి కల్యాణానికి పర్ణశాల, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిమిత్తం చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. రంగులతో ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు.

సుందరం శ్రీరామగిరి




చలువ పందిళ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

వరరామచంద్రాపురం, ఏప్రిల్ 16: వరరామచంద్రపురం మండలంలో ప్రసిద్ధి శ్రీరామగిరి గ్రామంలో శ్రీసుందర సీతారామచంద్రస్వామి వారి తిరు కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్వామివారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. శబరి, గోదావరి సంగమ తీరాన ఈ దేవాలయం రెండో భద్రగిరిగా పేరుపొందింది. స్వామి వారి తిరు కల్యాణం ప్రతిఏటా శ్రీరామనవమి పర్వదినాన అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. స్వామివారి కల్యాణానికి ఆలయ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మండపం చుట్టూ చలువ పందిళ్లు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. రాములోరి ఆలయాన్ని పంచవర్ణాలతో, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

రేతిరేల రాములోరి పెళ్లి




చేబ్రోలులో సీతారామ ఆలయం


గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 16: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలు గ్రామంలో సీతారామస్వామి దేవస్థానంలో మిగిలిన ప్రాంతాలకు భిన్నంగా స్వామివారి కల్యాణం జరుగుతుంది. సాధారణంగా ప్రతిచోట పగటిపూట కల్యాణం నిర్వహిస్తే ఇక్కడ రాత్రి వేళ సీతారామస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తారు. ఇక్కడ రాత్రి పూట స్వామివారి కల్యాణం జరపడం ఆనవాయితీగా వస్తోంది. పూర్వం పిఠాపురం మహారాజా ఇక్కడ కల్యాణంలో పాల్గొనేందుకు వీలుగా ఈ ఏర్పాటు చేసినట్లు చెబుతారు. అప్పటి నుంచి ఇదే పద్ధతిని పాటిస్తున్నారు. కల్యాణాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాలు నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. ఆలయ కమిటీ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది.

రత్నగిరిపై నవమి వేడుకలు ప్రారంభం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, ఏప్రిల్ 16: సత్యదేవుడి ఆలయ క్షేత్రపాలకులుగా పూజలందుకుంటున్న సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 24 వరకు జరిగే ఈ వేడుకలలో భాగంగా సీతారాములు తొలిరోజున పెండ్లి కుమారుడు, పెండ్లికుమార్తెలుగా అనుగ్రహించారు. సాయంత్రం 4 గంటలకు రామాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై నవ దంపతులు కానున్న సీతారాములను పెండ్లిపెద్దలైన సత్యదేవుడు, అనంత లక్ష్మీ అమ్మవార్లను మరోవేదికపై ఆశీనులు గావించారు. ఈ సందర్భంగా పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం ఉల్లాకల గౌరీపూజను నిర్వహించిన అనంతరం చతుర్వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ముత్తైదువులు పసుపు దంచి సీతారాములకు నుదుట తిలకం, బుగ్గను చుక్క పెట్టి దివ్యాభరణాలను అలంకరింపచేశారు. వైదిక కార్యక్రమాలను ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, వైదిక బృందం చామర్తి కన్నబాబు, గొల్లపల్లి వెంకట సుబ్రహ్మణ్య ఘనాపాటి, దేవులపల్లి ప్రసాద్ తదితరులు నిర్వహించగా పీఆర్వో కృష్ణారావు, ఏపీఆర్వో గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.



పసుపు దంచుతున్న ముత్తైదువులు

నేడు రాములోరి కల్యాణం

సీతారాముల దివ్య కల్యాణోత్సవాలలో భాగంగా రెండో రోజైన బుధవారం ఉదయం సీతారాముల దివ్య కల్యాణం వార్షిక కల్యాణ వేదికపై అంగరంగ వైభవంగా జరగనుంది. ఉదయం 6 గంటలకు ధ్వజారోహణం, అంకురార్పణ చేస్తారు అనంతరం నవదంపతులు కానున్న సీతారాములను వెండి ఆంజనేయ వాహనంపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవార్లను వెండిపల్లకిలో గ్రామోత్సవం నిర్వహించి కల్యాణ వేదిక వద్దకు తీసుకుని వచ్చి కల్యాణ తంతుకు శ్రీకారం చుడతారు.

రేపటి నుంచి వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలు




ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న అధికారులు



ఆత్రేయపురం, ఏప్రిల్ 16: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాలను ఈ నెల 18 నుంచి 24 వరకు వైభవంగా నిర్వహించనున్నారు. లక్షలాది మంది భక్తులు తరలి రానున్న దృష్ట్యా వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. 18వ తేదీ గురువారం అంకురార్పణ, ధ్వజారోహణతో కల్యాణోత్సవాలు ప్రారంభమవుతాయి. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు చైత్రశుద్ధ ఏకాదశి రోజున స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. అదే రోజు తీర్థం, రథోత్సవం జరుగుతాయి. 20న పొన్న వాహనంపై స్వామివారి గ్రామోత్సవం, 21న మహదాశీర్వచనం, సదస్యం. 22న గౌతమి నదిలో తెప్పోత్సవం, 23న మహా పూర్ణాహుతి, చక్రస్నానం, ధ్వజావరోహణ, 24 శ్రీపుష్పోత్సవంతో కల్యాణోత్సవాలు ముగుస్తాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన వాయిద్య కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ముఖ్య కూడళ్ల వద్ద హోర్డింగులు, అలంకరణలు చేస్తున్నారు. ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ ఉత్సవ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కొత్తపేట ఆర్డీవో సత్యనారాయణ రెండుసార్లు వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ట్రస్టు బోర్డు పదవీకాలం పూర్తికావడంతో ప్రత్యేకాధికారి పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనరు ఎం.విజయరాజును ప్రత్యేకాధికారిగా నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షించారు. ఆలయ పరిసరాలు, కల్యాణ వేదిక ప్రాంగణం, పుష్కరఘాట్ల వద్ద చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

విద్యుత్ తీగ తగిలి గేదెల కాపరి మృతి

గుట్టుచప్పుడు కాకుండా పూడ్చిపెట్టిన పొలం యజమాని

నిలదీయడంతో విషయం బయటకు..మృతదేహానికి పోస్టుమార్టం




సత్తిబాబు

రౌతులపూడి, ఏప్రిల్ 16: విద్యుత్‌షాక్‌కు గురై కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం గిడజాం గ్రామానికి చెందిన యర్రా సత్తిబాబు(42) మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. యర్రా సత్తిబాబు సోమవారం గేదెలను తొలుకుని వెళ్లాడు. ఇదే గ్రామానికి చెందిన పూడి తాతీజీకి చెందిన పొలంలో కోతులు బారి నుంచి పంటను రక్షించుకునేందుకు కంచెకు విద్యుత్ అమర్చాడు. విషయం తెలియని సత్తిబాబు తాతాజీ పొలంలోకి గేదెలు పోతుంటే మళ్లించడానికి వేగంగా వెళ్లాడు. విద్యుత్ అమర్చి ఉన్న కంచెకు తగులుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. విషయం బయటకు పొక్కకుండా తాతాజీ పక్కనే ఉన్న గెడ్డలో సత్తిబాబు మృతదేహన్ని పూడ్చిపెట్టాడు. గేదెలు తోలుకుని వెళ్లిన తండ్రి రాకపోవడంతో కుమారులు పొలంలో వెతకగా తండ్రి కన్పించలేదు. తాతాజీపై అనుమానంతో గట్టిగా నిలదీయగా జరిగిన విషయం చెప్పి మంగళవారం ఉదయం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. సీఐ శేఖర్‌బాబు, ఎస్ఐ వెంకటేశ్వరరావు, తహశీల్దార్ విద్యపతి సమక్షంలో పూడ్చిపెట్టిన మృతదేహన్ని బయటకు తీశారు. మృతదేహనికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

19న యానాంలో ఎంపీ పోలింగ్

నేటి సాయంత్రంతో ముగియనున్న ప్రచారం



సమీక్ష నిర్వహిస్తున్న ఆర్ఎ మునిస్వామి

యానాం, ఏప్రిల్ 16: కేంద్రపాలిత ప్రాంతమైనా యానాం నియోజవర్గంలో ఈనెల 19వ తేదీ శుక్రవారం పుదుచ్చేరి పార్లమెంట్ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. పుదుచ్చేరి రాష్ట్రానికి ఉన్న ఏకైక పార్లమెంట్ స్థానంలో మొత్తం 30 నియోజకవర్గాలు ఉన్నాయి. వాటిలో ఒకటి యానాం. మొత్తం 10,23,699 మంది ఓటర్లు ఉన్నారు. యానాంలో 39,408 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 19,037, మహిళలు 20,371 మంది ఉన్నారు. యానాం నియోజవర్గ పరిధిలో మొత్తం 10 వార్డులకు గాను 33 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని ఏర్పాట్లను యానాంలోని ఎన్నికల విభాగం పూర్తి చేసింది. పుదుచ్చేరి లోక్‌సభ స్థానం నుంచి మొత్తం 26 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. గత కొన్ని రోజులుగా యానాంలో ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. 17వ తేదీన సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగియనుంది. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఎన్డీయే అలియెన్స్‌లో ఉండటంతో బీజేపీకి మద్దతు తెలపగా స్థానిక స్వతంత్ర ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కూడా బీజేపీకి మద్దతు తెలపడంతో ఇరువురు బీజేపీకి ప్రచారం నిర్వహించడం విశేషం.

రూ.6 లక్షల పట్టివేత

పెద్దాపురం, ఏప్రిల్ 16: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన తనిఖీల్లో రూ.6లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పెద్దాపురం ఆర్డీవో జె.సీతారామారావు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కె. వెంటరాజగుప్త ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో కాండ్రకోట గ్రామానికి చెందిన పల్లికల రామచంద్రమూర్తి నుంచి రూ. 6లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన నగదుకు సరైన ధ్రువపత్రాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసి ట్రెజరీకి జమ చేశామన్నారు.

రూ.2.97 లక్షలు స్వాధీనం

కిర్లంపూడి, ఏప్రిల్ 16: యానాం నుంచి ప్రత్తిపాడు వెళ్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి రూ.2.97లక్షలు కిర్లంపూడిలో మంగళవారం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. యానాంకు చెందిన సమయంతుల వెంకటసూర్య మల్లేశ్వరరావు కారులో డబ్బుతో కిర్లంపూడి మీదుగా ప్రత్తిపాడు వెళ్తున్నాడు. ఆయన వద్ద ఎటువంటి ఆధార పత్రాలు లేకపోవడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ ఆ సొమ్మును స్వాధీన పరుచుకుని జగ్గంపేట అర్వో కార్యాలయానికి తరలించింది. సంబంధిత ఆధార పత్రాలు చూపిస్తే సొమ్ము తిరిగి ఇస్తామని ఆర్వో శ్రీనివాస్ తెలిపారు.

కోడి పందాలపై పోలీసుల దాడి

రావులపాలెం, ఏప్రిల్ 16: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం పొడగట్లపల్లిలోని ఓ తోటలో మంగళవారం రహస్యంగా కోడి పందేలు నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న సీఐ ఆంజనేయులు సిబ్బందితో అక్కడికి చేరుకుని దాడి చేశారు. 40 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,28,400 నగదు, 15 మోటారు సైకిళ్లు, మూడు కార్లు, 13 కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు సీఐ చెప్పారు.

జగన్ టూర్ షెడ్యూల్లో మార్పు

రావులపాలెం, ఏప్రిల్ 16: సీఎం జగన్ టూర్ షెడ్యూల్లో మార్పు జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడు శివారు మల్లయ్యదొడ్డి సెంటరు సమీపంలోని ఒక ప్రైవేటు లే-అవుట్‌లో సీఎం మంగళవారం రాత్రి బస చేయాల్సి ఉండగా ఆ కార్యక్రమం రద్దయ్యింది. ఈ నెల 18న ఆయన బస్సు యాత్ర రావులపాలెం మీదుగా మడికి వస్తుంది.

సచివాలయ కార్యదర్శి సస్పెన్షన్

కడియం, ఏప్రిల్ 16: మండలంలోని కడియపులంక సచివాలయం-2 గ్రేడ్ 5 కార్యదర్శి ఎండీ ఫర్విన్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఉత్తర్వులు జారీ చేశారు. ఫర్విన్ గ్రామంలో 219 పోలింగ్ బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్ఓ)గా ఉన్నారు. అయితే గ్రేడ్ 5 కార్యదర్శి బీఎల్‌వో డ్యూటీ చేయడం ఏమిటని మండలస్థాయి అధికారులకు ఎదురుచెప్పడంతో జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నియోజకవర్గ ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ స్వయంగా ఇచ్చిన ఆదేశాలు కూడా ఆమె లెక్కచేయలేదు. దీంతో కలెక్టర్‌కు రిపోర్ట్ చేయడంతో ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నందుకుగాను ఫర్విన్‌ను సస్పెండ్ చేస్తూ మాధవీలత ఉత్తర్వులు జారీ చేశారు.

రిటర్నింగ్ అధికారులు సన్నద్ధంగా ఉండాలి

రంపచోడవరం, ఏప్రిల్ 16: ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నిర్వహణకు రిటర్నింగ్ అధికారులు సర్వసన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. విజయవాడ నుంచి మంగళవారం సాయంత్రం అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం నుంచి కలెక్టర్ ఎం.విజయసునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న నామినేషన్ల స్వీకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలు ఇతర అంశాలపై సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్సులో ఆర్వోలు, జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి పాల్గొన్నారు.

ఘనంగా ఏపీటీఎఫ్ 80వ ఆవిర్భావ వేడుకలు

మండపేట, ఏప్రిల్ 16: తాపేశ్వరం కేంద్రంగా 80 ఏళ్ల క్రితం అంటే 1944 ఏప్రిల్ 16న ఆవిర్భవించిన ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆవిర్భావ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజరాజేశ్వరి కల్యాణ మండపంలో సంఘం రాష్ట్రాధ్యక్షుడు జి.హృదయరాజు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఉపాధ్యాయుల సమస్యలపై తమ సంఘం చేస్తున్న పోరాటం, సాధించిన విజయాలను వక్తలు వివరించారు. ముఖ్య అతిథిగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పుత్రసత్యశర్మ మనుమడు పుత్రసత్యశర్మ హాజరై మాట్లాడుతూ తన తాతయ్య ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడేందుకు ఏర్పాటు చేసిన సంఘం నేటికి నిర్విరామంగా కొనసాగుతుండటం హర్షణీయమన్నారు. ఉపాధ్యాయ ప్రగతి పత్రిక, ప్రధాన సంపాదకులు జి.సత్యనారాయణ, ఐపీయూ నాయకులు కె.సుబ్బారెడ్డి, గౌరవ అధ్యక్షుడు ఎ.సదాశివ, సీనియర్ కామ్రేడ్ రామారావు, లక్ష్మణరావు, కేవీవీ సత్యనారాయణ, ఉదయబ్రహ్మం, కనుపూరి సుబ్బారావు, కనుపూరి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సరికొత్త బోధనా పద్ధతులపై శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 16: నూతన విద్యా విధానాన్ని అనుసరించి సరికొత్త బోధనా పద్ధతులపై అర్థశాస్త్ర అధ్యాపకులకు శిక్షణా కార్యక్రమం మంగళవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ప్రారంభమైంది. కళాశాల విద్య కమిషనరేట్ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 22వ తేదీ వరకూ ఈ శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. రాజమహేంద్రవరం, కాకినాడ, తణుకు, తాడేపల్లిగూడెం, విజయవాడ నోడల్ రిసోర్సు కేంద్రాల పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అర్థశాస్త్ర అధ్యాపకులు పాల్గొన్నారు. కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్ వర్చువల్ విధానంలో ఈ తరగతులను ప్రారంభిస్తూ నూతన విద్యా విధానం-2020లో సింగిల్ మేజర్ సబ్జెక్టుల కోసం కళాశాల విద్య తీసుకుంటున్న విధానాలను వివరించారు. అధ్యాపకులకు దిశా నిర్దేశం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు, నోడల్ రిసోర్స్ కేంద్రం రాజమహేంద్రవరం సమన్వయకర్త సీహెచ్ సంజీవ్‌కుమార్, నాలెడ్జ్ రిసోర్సు పర్సన్లు డీవీ నాగేశ్వరరావు, కె.యమున, కె.స్వరూప, జి.పావని దేవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమికి ఏర్పాట్లు

అంతర్వేది, ఏప్రిల్ 16: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని మూడు రోజులు కోదండరామస్వామి జయంతి వేడుకలు నిర్వహిస్తారని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. 19 నుంచి 24వరకు కోదండరామస్వామి పంచాహ్నిక కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు. అంతర్వేది దేవస్థానం, అంతర్వేది, కేశవదాసుపాలెం, మోరి, వీవీమెరక, టేకిశెట్టిపాలెం, సఖినేటిపల్లి, రామేశ్వరం గ్రామాల్లో శ్రీరామనవమికి ఆలయాలను ముస్తాబు చేశారు.

- కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు
- వాసాలతిప్పలో 'జయహో బీసీ' సదస్సు
- చల్లపల్లి పంచాయతీ పరిధిలో ఎన్నికల ప్రచారం

తోటను ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలి


రాజోలు: నినాదాలు చేస్తున్న దళిత నాయకులు,


మలికిపురం: టీడీపీ ఎస్సీ నాయకుల సమావేశం

రాజోలు, ఏప్రిల్ 16: తోట త్రిమూర్తులును ఎమ్మెల్సీ పదవి నుంచి తక్షణమే తొలగించాలని దళిత నాయకులు డిమాండు చేశారు. రాజోలులో దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ అధ్యక్షతన మంగళవారం దళిత నాయకుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా సామాజిక హక్కుల వేదిక నాయకుడు దేవ రాజేంద్రప్రసాద్, పీడీఎం రాష్ట్ర నాయకుడు దీపాటి శివప్రసాద్ మాట్లాడుతూ దళితుల శిరోముండనం కేసులో తోట త్రిమూర్తులుకు విశాఖపట్నం ప్రత్యేక కోర్టు 18నెలలశిక్ష, రూ.2లక్షల జరిమానా విధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. న్యాయ పోరాటం చేసిన దళిత ప్రజా సంఘాల కృషిని జేఏసీ నాయకులు పొలమూరి శ్యామ్‌బాబు అభినందించారు. అంబేడ్కర్ విగ్రహానికి దళిత నాయకులు పాలాభిషేకం చేసి న్యాయ వ్యవస్థ వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బత్తుల జనార్ధనరావు, బుడితి గోపాలకృష్ణ, చిలకపాటి శ్రీధర్, జిల్లెల్ల వినోద్‌బాబు, తెన్నేటి నాగేశ్వరరావు, కాకర విశ్వనాథం పాల్గొన్నారు.

న్యాయమే గెలిచింది

మలికిపురం, ఏప్రిల్ 16: రామచంద్రపురంలో శిరోముండనం కేసులో న్యాయమే గెలిచిందని ఎస్సీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం విశ్వేశ్వరాయపురంలో అమలాపురం పార్లమెంటు ఎస్సీ అధికార ప్రతినిధి గెడ్డం సింహ అధ్యక్షతన జరిగిన తెలుగుదేశం పార్టీ సమావేశంలో పలువురు మాట్లాడారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదనే సంగతి రుజువైందన్నారు. నేరాలకు పాల్పడిన వారికే వైఎస్ జగన్ టిక్కెట్లు ఇచ్చారని, అటువంటి వ్యక్తులను సమాజం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బండెల పద్మ, మోకా పార్వతి, గెడ్డం సింహ, వీబీఎస్ గోపాలరావు, రాపాక నవరత్నం, గోనిపాటి రాజు, రాపాక ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

న్యాయస్థానం తీర్పుపై హర్షం

మండపేట, ఏప్రిల్ 16: రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో దళిత యువకులకు జరిగిన శిరోముండనం కేసులో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు న్యాయస్థానం శిక్ష విధించడం పట్ల సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు, వెంటపల్లి బీమశంకర్, గుబ్బల ఆదినారాయణ హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో దళితులు సాధించిన విజయమన్నారు. విశాఖలో న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. తోటను వైసీపీ నుంచి బహిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

శిరోముండనం కేసులో న్యాయం గెలిచింది

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 16: శిరోముండనం కేసులో న్యాయం గెలిచిందని కపిలేశ్వరపురం గ్రామసర్పంచ్ సాకా శ్రీనివాస్ అన్నారు. 1996లో వెంకటాయపాలెంలో జరిగిన శిరోముండనం కేసులో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ విశాఖ కోర్టు మంగళవారం తీర్పు చెప్పడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

దళిత నాయకుల హర్షం

రాయవరం, ఏప్రిల్ 16: శిరోముండనం కేసులో న్యాయం గెలిచిందని మంగళవారం దళిత నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మాచవరంలో దళిత నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈతీర్పు ద్వారా భవిష్యత్‌లో దళితులపై దాడులకు తెగబడే వారికి గుణపాఠం కావాలన్నారు. దళితులంతా ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. మలకా అప్పారావు, గండి చంద్రశేఖర్ నెల్లి రాము, ఏలేటి పెద్ద, సాదే కరణ్‌కుమార్, పోలినాటి రాజు ఏలేటి నల్లయ్య పాల్గొన్నారు.

దళితుల విజయం

మండపేట, ఏప్రిల్16: శిరోముండనం కేసులో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు న్యాయస్థానం శిక్ష పడటం దళితుల విజయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దూళి జయరాజు అన్నారు. ఇది దళితులు విజయమన్నారు. తోటకు సీటు ఇవ్వవద్దని, ఆయనకు సీటు ఇస్తే ఓడించి తీరతామని ఆయన హెచ్చరించారు. దళిత నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తోటను వైసీపీ నుంచి సస్పెండ్ చేయకపోతే ఎన్నికల్లో దళితులు సత్తా చూపుతామని, వైసీపీని ఓడిస్తామన్నారు.

వలసలే వైసీపీ పతనానికి సంకేతం


పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న నాయకులు

అంబాజీపేట, ఏప్రిల్ 16: కూటమి పార్టీలో చేరికలే వైసీపీ పతనానికి సంకేతమని టీడీపీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. వక్కలంకలో టీడీపీ నాయకులు వాసంశెట్టి చినబాబు ఆధ్వర్యంలో మండలానికి చెందిన వంద మంది వైసీపీని వీడి టీడీపీ, జనసేన పార్టీల్లో చేరారు. టీడీపీ మండలాధ్యక్షుడు దంతులూరి శ్రీనురాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ప్రసంగించారు. అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, పి.గన్నవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ విజయానికి కృషిచేయాలని సూచించారు. టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, నాయకులు నామన రాంబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, డొక్కా నాథ్‌బాబు, నల్లా పవన్‌కుమార్, దాసరి వీరవెంకట సత్యనారాయణ, వాసంశెట్టి కుమార్, గణపతి వీరరాఘవులు, వాసంశెట్టి వరలక్ష్మి, బొంతు పెదబాబు, యనమదల రాజబాబు, దొమ్మేటి సాయికృష్ణ, గుడాల ఫణి, వాసంశెట్టి రాంబాబు, నూటుకుర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొత్తపేట చేరిన ఈవీఎంలు

కొత్త పేట, ఏప్రిల్ 16: కొత్తపేట అసెంబ్లీ ఈవీఎంలు, పార్లమెంటుకు సం బంధించిన ఈవీఎంలు మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌కు చేరుకున్నాయి. పార్లమెంట్‌కు సంబంధించి 314 బ్యాలెట్ యూనిట్ బ్యాక్సులు, కంట్రోలింగ్ యూనిట్స్ 314, వీవీ ప్యాడ్‌లు 340, అసెంబ్లీలో 262పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఈవీఎంలు చేరుకున్నాయి. అయితే వాటిని టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌కు ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ, తహసీల్దారు జి.ఎలిషా, ఆర్ఐ ఏడుకొండల సమక్షంలో సీలువేసి భద్రపరిచారు. ఎన్నికలరోజు వరకూ విద్యుత్ సదుపాయంతో భద్రత ఏర్పాటు చేశారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

మామిడికుదురు, ఏప్రిల్ 16: మామిడికుదురు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కె.వనజనాకుమారి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో సాదాసీదాగా సమావేశాన్ని నిర్వహించారు. వేసవి నేపథ్యంలో పలువురు సర్పంచ్‌లు గ్రామాల్లోని తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వేణుగోపాలరెడ్డి, ఏవో కె.వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముసుగు తొలగించుకున్న వైసీపీ ఏజెంట్లు

కాట్రేనికోన, ఏప్రిల్ 16: చెయ్యేరుకు చెందిన 44మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేయడంపై కూటమి నాయకులు ఘాటుగా స్పందించారు. గ్రామ వలంటీర్లు వైసీపీ ఏజెంట్లుగా పనిచేస్తూ రాజీనామాతో ముసుగు తొలగించుకుని నిజాలను బయటపెట్టారన్నారు. చెయ్యేరులో మంగళవారం కూటమి నాయకులు సమావేశం నిర్వహించారు. గ్రామ వలంటీర్లు తమ పార్టీ కార్యకర్తలేనని పలుమార్లు వైసీపీ నాయకత్వం వ్యాఖ్యానించడాన్ని వారు గుర్తుచేశారు. వలంటీర్లు సేవకులని వారికి గౌరవవేతనం మాత్రమే ఇస్తున్నామని పదేపదే చెప్పిన వైసీపీ నాయకత్వం ఇప్పుడు వారితో రాజీనామాలు చేయించి పార్టీ ఏజెంట్లుగా వాడుకోవాలని ప్రణాళిక సిద్ధం చేసుకుందన్నారు. సూదా బాబూరావు, చెల్లి సురేష్, త్సవటపల్లి నారాయణస్వామి, బసవా మురళీ, కాయల బలరామ్, ఉచ్చుల నారాయణ, సలాది నానాజీ, నామా వెంక్రిబాబు, గుత్తుల శ్రీనివాస్, గుబ్బల ఏసు, త్సవటపల్లి మణికుమార్, నంద్యాల సురేంద్ర, పోతంశెట్టి చంద్రశేఖర్, కానూరి ప్రకాశరావు, గిడ్డి చంటిబాబు పాల్గొన్నారు.

నామినేషన్లలో నిబంధనలు తప్పనిసరి

పి.గన్నవరం, ఏప్రిల్ 16: ఈనెల18 నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని, ప్రతి అభ్యర్థి నిబంధనలు అనుసరించి నామినేషన్ పత్రాలను దాఖలు చేయాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 25వ తేదీ 3గంటలు వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. అనంతరం రాజకీయ పార్టీల నాయకులు అడిగిన పలు అంశాలపై ఆయన వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎస్‌కె హుసేన్, తహసీల్దార్లు ఎం.మెరికమ్మ, జె.విమలకుమారి, ఎంపీడీవోలు సిహెచ్ త్రిశూలపాణి, టి.సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

కూటమి పాలనలో బీసీలకు బంగారు భవిష్యత్తు


బీసీ సదస్సులో మాట్లాడుతున్న అయితాబత్తుల ఆనందరావు

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 16: రాబోయే కూటమి పాలనలో బీసీలకు బంగారు భవిష్యత్ ఉంటుందని అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ ఆధ్వర్యంలో గ్రామ శాఖ అధ్యక్షుడు నిమ్మకాయల చెల్లయ్యనాయుడు అధ్యక్షతన మంగళవారం సముద్ర తీరం గ్రామం వాసాలతిప్పలో 'జయహో బీసీ' సదస్సు జరిగింది. కార్యక్రమంలో బీసీ నాయకులు లంకే భీమరాజు, గుత్తుల నాగేశ్వరరావు, యరగర్త వెంకటేశ్వరరావు, మల్లాడి వెంకటరమణ, పిచ్చుక వీరభద్రరావు, కొల్లు రాంబాబు, బలసాడి వెంకటేష్, పెసంగి రాంబాబు, రచ్చా అప్పా రావు, కర్రి వడ్డికాసులు, కొల్లు శ్రీను, అంకాడి వీరబాబు, ఖైల అర్జునరావు, కర్రి వర్మ, మల్లాడి పెదధర్మారావు, ఖైల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో సంక్షేమానికి దూరంగా ఎస్సీ వర్గాలు

జగన్ పాలనలో రాష్ట్రంలో ఎస్సీ వర్గాల ప్రజలకు సంక్షేమం అందని ద్రాక్షగా మిగిలిందని అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు అన్నారు. మంగళవారం చల్లపల్లి పంచాయతీ పరిధిలోని ఎస్సీపేటల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండలఅధ్యక్షుడు అరిగెల నానాజీ అధ్యక్షతన గ్రామకమిటీ అధ్యక్షకార్యదర్శులు నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, బూసి బుజ్జిదొర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, గొలకోటి చిన్నా, దంగేటి రవీంద్రనాథ్, పోలిశెట్టి శివాజీ, ఎన్. లక్ష్మణపేరయ్యనాయుడు, జనసేనకు చెందిన ఇసుకపట్ల రఘుబాబు, యాళ్ల సతీష్, నల్లా శ్రీధర్, ఏడిద శ్రీను, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, ఆకుల సూర్యనారాయణమూర్తి, ఆకుల బుజ్జి, నాగిరెడ్డి రాంబాబుపాల్గొన్నారు.

ఎన్‌డీఏతోనే మాదిగల అభ్యున్నతి సాధ్యం

పి.గన్నవరం, ఏప్రిల్ 16: ఎన్‌డీఏతోనే మాదిగల అభ్యున్నతి సాధ్యమని ఎమ్మార్పీఎస్ ఉత్తర కోస్తా ఆంధ్ర జిల్లాల ఇంచార్జ్ ముమ్మిడివరపు చిన్నసుబ్బారావు అన్నారు. పి.గన్నవరంలో ఆయన స్థానిక నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి ఎన్డీయే అభ్యర్థి గిడ్డి సత్యనారాయణకు మద్దతు ఇచ్చి అనంతరం మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆదేశాలతో ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధూర్, గిడ్డి సత్యనారాయణ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పి.గన్నవరం ఎమ్మార్పీఎస్ ఎన్నికల పరిశీలకుడుగా నేదునూరి రాజేష్, కోఇన్‌చార్జ్‌గా తొత్తరమూడి ఆనంద్, మహాజన సోషలిస్టు పార్టీ ఇంచార్జ్‌గా మల్లవరపు వెంకన్నను నియమించారు. యార్లగడ్డ సత్తిబాబు, లూటుకుర్తి చిన్న, సవరపు భైరవమూర్తి, నేదునూరి వీర్రాజు, పెదపూడి శ్రీను, ఆకుమర్తి ఆశీర్వాదం, ఈతకోట సత్యనారాయణ, నాని, శ్రీధర్ పాల్గొన్నారు.

తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు

మలికిపురం, ఏప్రిల్ 16: రాజోలు నియోజకవర్గంలో పలు గ్రామాల్లో తాగునీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్ అన్నారు. మంగళవారం గూడపల్లి పల్లిపాలెం, గుబ్బలపాలెం గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో భూగర్భ జలాలు కలుషితమయ్యాయని, గ్రామాలకు కనీస తాగునీటి సౌకర్యం కల్పించలేని దుస్థితిలో ఈప్రభుత్వం ఉందన్నారు. ఉమ్మడి ప్రభుత్వంలో నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అడబాల యుగంధర్, మాజీఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి, గోసంగి శ్రీనివాస్, గుబ్బల నూకాలు, గుబ్బల రామారావు, కందికట్ల సూరిబాబు, కొప్పాడి వీరవెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామాలాభివృద్ధి: సుభాష్


యండగండిలో రోడ్ షో నిర్వహిస్తున్న సుభాష్, హరీష్‌మాధుర్

కె.గంగవరం, ఏప్రిల్ 16: టీడీపీతోనే గ్రామాలాభివృద్ధి జరుగుతాయని కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం యండగండి, పామర్రు గ్రామాల్లో ఆయన ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌తో కలిసి రోడ్‌షో నిర్వహించారు. యండగండిలో పార్టీ సీనియర్ నాయకుడు చంద్రు వీవీఎస్ఎస్ చౌదరి ఆధ్వర్యంలో పలు సామాజిక వర్గాల ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. మహిళలు హారతులు పలికారు. పలు కూడళ్లలో సుభాష్ మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు దగా పడ్డారన్నారు. పెరిగిన ధరలతో ప్రజల జీవితాలు అతలాకుతం అయ్యాయని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పి, పథకాలు గురించి వివరించారు. టీడీపీకి ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మరివాడ సూరిబాబు, మార్ని శ్రీధర్, శీరెడ్డి సత్తిబాబు, రవ్వా భూషణం, నేమాని అబ్బు, జనసేన నాయకులు చిర్రా రాజ్‌కుమార్, బీజేపీ నాయకులు కాదా వెంకట రమణ, గుర్రాల సత్యనారాయణ పాల్గొన్నారు.

రావులపాలాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తా

కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు


రావులపాలెం అంకాలమ్మ గుడి వద్ద నుంచి ప్రజాగళం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బండారు సత్యానందరావుకు హారతి ఇస్తున్న మహిళలు


ఆత్రేయపురంలో సూపర్‌సిక్స్ క్యాలెండర్‌ను అందిస్తున్న పార్టీ అధ్యక్షుడు వెంకట్రాజు


రావులపాలెంలో సూపర్‌సిక్స్ కరపత్రాలు పంచుతున్న బండారు సత్యానందరావు

రావులపాలెం, ఏప్రిల్ 16: జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న రావులపాలాన్ని అన్ని సౌకర్యాలతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలోని అంకాలమ్మ గుడి వద్ద నుంచి కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు ప్రజాగళం ఎన్నికల ప్రచారం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి పర్యటిస్తూ సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రావులపాలెంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు తాను ఎమ్మెల్యేగా అరటి మార్కెట్‌యార్డును తీసుకురావడంతో పాటు కొత్తకాలనీ, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. కాని నేడు వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి నిబంధనలకు విరుద్ధంగా బార్ సాంస్కృతి తీసుకువచ్చారన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే రావులపాలాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణుల ముమ్మర ప్రచారం

ఆత్రేయపురం, ఏప్రిల్ 16: కొత్తపేట నియోజకవర్గ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు విజయాన్ని ఆకాంక్షిస్తూ మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటిం టికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఎంపీ అభ్యర్థి హరీష్, ఎమ్మెల్యే అభ్యర్థి బండారును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ, జనసేన, బీజేపీల పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. అలాగే వివిధ గ్రామల్లో పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించి టీడీపీ మేనిఫెస్టో పథకాలను వివరించారు.

జనచైతన్యానికి పాట ప్రతీక

అమలాపురం టౌన్, ఏప్రిల్ 16: జన చైతన్యానికి పాట ప్రతీకగా నిలుస్తుందని ప్రముఖ రచయిత సరెళ్ల వెంకటరత్నం పేర్కొన్నారు. సామ్రాట్ అశోక చక్రవర్తి జయంతిని పురస్కరించుకుని జనచైతన్య మండలి రాష్ట్ర వ్యవస్థాపకుడు పెయ్యల పావనప్రసాద్ రచించి స్వరకల్పన చేసిన అంబేడ్కర్-బౌద్ధ భావజాల పాటల సీడీని రిపబ్లికన్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డీబీ లోక్ అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో మంగళవారం ఆవిష్కరించారు. దేశానికి రక్షణ కవచం అంబేడ్కర్ తత్వం కదా అంటూ ప్రారంభించి 14పాటలను సీడీలో పొందుపరిచినట్టు వివరించారు. కార్యక్రమంలో దళిత బహుళ చైతన్య వేదిక ప్రతినిధులు వీవీ సత్యనారాయణమూర్తి, రచయిత వజ్రపు సాంబమూర్తి, నాగాబత్తుల ప్రసాదరావు, జంగా బాబూరావు, పెయ్యల పరశురాముడు, డాక్టర్ కె. రామారావు, ఎన్.పెద్దిరాజు, కె.రాంబోధి, ఈవీవీ సత్యనారాయణ, ఎలిజబెత్‌రాణి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడు దంతులూరి టీడీపీలో చేరిక


టీడీపీలోకి ఆహ్వానిస్తున్న పార్లమెంటరీ అభ్యర్థి హరీష్‌మాధుర్

రాజోలు, ఏప్రిల్ 16: చింతలపల్లికి చెందిన వైసీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు దంతులూరి అచ్యుతరామరాజును డిప్యూటీ మాజీ స్పీకర్ అల్లూరి వెంకటసూర్యనారాయణరాజు, రాజోలు నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు సమక్షంలో అమలాపురం పార్లమెంటు కూటమి అభ్యర్థి గంటి హరీష్ మాధుర్ కండువా కప్పి మంగళవారం టీడీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో దంతులూరి రామకృష్ణంరాజు, గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, భూపతిరాజు ఈశ్వరరాజు, జగడం సత్యనారాయణ, మంగెన భూదేవి, బందెల పద్మ, మోకా పార్వతి, అడబాల సాయిబాబు, పిప్పళ్ల రాంబాబు, అనుచూరి పురుషోత్తం, కడలి పాలెంశెట్టి, బత్తుల నారాయణరావు, బులుసు గిరిబాబు పాల్గొన్నారు.

తీర ప్రాంతం వెంబడి టూరిజం కారిడార్

అమలాపురం టౌన్, ఏప్రిల్ 16: తీర ప్రాంతం వెంబడి టూరిజం కారిడార్ ఏర్పాటు చేస్తానని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. ఎస్.కొత్తపల్లి నుంచి ఓడలరేవు వరకు బీచ్‌లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంతో పాటు టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. అమలాపురాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అమలాపురంలో హోటల్ శుభగృహలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆనందరావు మాట్లాడారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామినాయుడు, టీడీపీ, జనసేన నాయకులు నల్లా స్వామి, దెందుకూరి సత్తిబాబురాజు, కంచిపల్లి అబ్బులు, లింగోలు పండు తదితరులు పాల్గొన్నారు.

కొండాలమ్మతల్లి జాతర మహోత్సవం

ముమ్మిడివరం, ఏప్రిల్ 16: ముమ్మిడివరంలోని శ్రీ కొండాలమ్మతల్లి జాతర మహోత్సవం మంగళవారం అత్యంత వైభవోపేతంగా సాగింది. ఈనెల9న ప్రారంభమైన జాతర మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. అమ్మవారికి కుంకుమపూజ, భజనలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం గరగ పూజ నిర్వహించి అమ్మవారిని బాణసంచా కాల్పులు, భాజాభజంత్రీలు, గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో ముమ్మిడివరం పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ చైర్మన్ పెట్టా శివప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, పి.కుమార్‌రాజారమేష్, జి.శ్రీనుబాబు, జె.వెంకటేశ్వరరావు, జి.శ్రీనివాసరావు, పి.రమణలతో పాటు పలువురి ఆధ్వర్యంలో అమ్మవారి ఊరేగింపు జరిగింది. గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు.

18న నోటిఫికేషన్ విడుదల

ముమ్మిడివరం, ఏప్రిల్ 16: ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గం నంబరు 43కు సంబంధించి ఈనెల18వ తేదీ ఉదయం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తామని రిటర్నింగ్ అధికారి వి.మదన్ మోహనరావు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ ప్రతులను నియోజకవర్గ పరిధిలోని నాలుగు తహసీల్దార్ కార్యాలయాలు, నాలుగు ఎంపీడీవో కార్యాలయాలు, పంచాయతీ కార్యాలయాల్లో, అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద నోటీసు బోర్డులో ఉంచుతామన్నారు. అదేరోజు నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ పత్రాలు స్వీకరిస్తామన్నారు. 26న నామినేషన్ల పరిశీలన, అదేరోజు గుర్తులు కేటాయింపు చేస్తామన్నారు. 26నుంచి 29వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు అభ్యర్థులు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉందన్నారు. మే13న ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు.

అసమర్థ పాలనలో రాష్ట్రం అధోగతి

అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు


ఎన్నికల ప్రచారం చేస్తున్న దాట్ల బుచ్చిబాబు


వృద్ధుడిని పలకరిస్తున్న దాట్ల బుచ్చిబాబు


ప్రచారంలో మహిళకు టీడీపీ మేనిఫెస్టో కరపత్రం అందిస్తున్న బుచ్చిబాబు

కాట్రేనికోన, ఏప్రిల్ 16: జగన్ అసమర్థ పాలనతో రాష్ట్రం అధోగతి పాలయ్యిందని ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు అన్నారు. మంగళవారం కుండలేశ్వరం, నడవపల్లి, బంటుమిల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత కుండలేశ్వరాలయంలో ఆయన పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటెయ్యాలంటూ అభ్యర్థించారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే వృద్ధులకు పింఛన్ రూ.4వేలు ఇస్తామన్నారు. వికలాంగులకు రూ.6వేలు పింఛన్ అందిస్తామన్నారు. కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. ప్రచారంలో వృద్ధులను పకలరించి ఓటు వేయాలని కోరారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని వైసీపీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ సొంత ప్రయోజనాలకు తప్ప నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. స్వగ్రామం అయినాపురం రోడ్డును కూడా కనీసం ఆధునీకీకరించపోవడంలో ఆయన అసమర్థత వ్యక్తం అవుతుందన్నారు. మళ్లీ అభివృద్ధి కావాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. గ్రామాల్లో బుచ్చిబాబుకు మహిళలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. సమర్థుడైన చంద్రబాబు నాయుడు సీఎం అయితేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. సంక్షేమ పథకాలు కూడా అందరికీ అందిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ళ దొరబాబు, నాగిడి నాగేశ్వరరావు, నడింపల్లి సుబ్బరాజు, మోకా సుబ్బారావు, చెల్లి సురేష్, రంబాల రమేష్, వాసంశెట్టి రాజేశ్వరరావు, బీమాల సూర్యానాయుడు, విత్తనాల బుజ్జి, కోటిపల్లి సత్యనారాయణ, మోకా లోవరాజు పాల్గొన్నారు.


ఐ.పోలవరం: టీడీపీలో చేరుతున్న మత్స్యకారులు

టీడీపీలో చేరిన పశువుల్లంక మత్స్యకారులు

ఐ.పోలవరం, ఏప్రిల్ 16: పశువుల్లంకకు చెందిన 30 మత్స్యకార కుటుంబాలు మంగళవారం వైసీపీని వీడి ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మోకా సురేష్, లంకే ఆదినారాయణ, లంకే వీరబాబు, లంకే వీరబ్రహ్మం, సంగాడి మహేష్, పెమ్మాడి మదన్, అర్దాని వీరబాబు, ఓలేటి ధర్మారావు, మోర్త లోవరాజు, పాలెపు రాజు, వనమాడి మణికంఠ, మల్లాడి శ్రీను తదితరులున్నారు. కూటమి అభ్యర్థులు దాట్ల బుచ్చిబాబు, గంటి హరీష్‌మాధుర్‌ల విజయానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.


ప్రచారంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబుకు హారతి ఇస్తున్న మహిళ

అభ్యర్థులకు మద్దతుగా నాయకుల ప్రచారం


నమశ్శివాయకు మద్దతుగా మల్లాడి అనుచరుల ప్రచారం

యానాం, ఏప్రిల్ 16: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తున్న అభ్యర్థుల తరపున మద్దతుదారులు ప్రచారం నిర్వహిస్తున్నారు. బుధవారం సాయంత్రం ఐదు గంటలతో ప్రచారానికి తెర పడుతుంది. ఎన్‌డీఏఅభ్యర్థి ఏ.నమశ్శివాయకు మద్దతుగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు నేతృత్వంలో ఎన్ఆర్ కాంగ్రెస్ యానాం అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, మాజీ మున్సిల్ చైర్మన్ గిడ్ల చంద్రరావు, వైస్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, రిటైర్డ్ సీఐ గూటం శివగణేష్, బడుగు బలరాం గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నమశ్శివాయను అత్యధిక మెజార్టీతో గెలిపించి యానాన్ని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసుకుందామని ఓటర్లకు వివరించారు.నమశ్శివాయకు మద్దతుగా బీజేపీ యానాం శాఖ అధ్యక్షుడు కనకాల రాజు ఆధ్వర్యంలో మెట్టకుర్రు, గోపాల్‌నగర్ వార్డు పరిధిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నమశ్శివాయను యానాం నుండి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి పోటీచేస్తున్న వి.వైద్యలింగానికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మల్లాడి సత్తిబాబు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్ధాది దినేష్ నేతృత్వంలో యానాంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు వెళ్లి కాంగ్రెస్ మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. పుదుచ్చేరి నుంచి వచ్చిన కాంగ్రెస్ ప్రతినిధి పెద్దసాయి పెరుమాళ్, రాందాసు ప్రచారంలో పాల్గొన్నారు.